# అమృతహస్తం

పార్ధసారధి శంకరమంచి

సూర్యుడానాటికి బాల్య, కౌమార దశలుదాటి వృధ్ధదశలోకి అడుగు పెట్టి చాలా సేపయ్యింది. కొద్ది సేపట్లో అస్థమించి ఆనాటికి బ్రతుకు చాలించాల్సొస్తుందన్న బయం సూర్యుడిలో కనబడుతోంది. మేఘాలు నవ్వుకుంటున్నాయి.

కామాక్షమ్మ గారికి మెల్లగా స్పృహ తప్పిపోతూంది, మైకం కమ్మేస్తోంది, ఆమె అఖరి సారిగా కళ్ళు పెద్దవి చేసి భర్తకేసి చూసింది. పతంజలి గార్కి గుండెల్నిండా దు:ఖం, కళ్ళనిండా నీళ్ళు నిండున్నాయి. తులసినీళ్ళు ఉద్ధరణజతో మెల్లగా ఆమె నోట్ల పోస్తున్నారు. ఆమె అతి కష్టం మీద రెండు గుటకలు వేసింది. అంత దు:ఖంలోను పతంజలి గార్కి ఆనందం కల్గింది. మూడోసారి పోసిన తీర్థం గొంతులోకి పోలేదు, పైకి వచ్చేసింది.

సూర్యుడు అస్తమించి చీకట్లో కల్సిపోయాడు భర్త ఆమె ముఖంలోకి చూశారు. ఆమె కళ్ళు నిండుగా తెరుచుకుని నిశ్చలంగా ఉన్నాయి. పక్కనే వున్న శాస్త్రిగారు ఆమె కళ్లు మూసేశారు అవి ఎప్పటికీ తెరచు కోవన్న సంగతి గ్రహించి పతంజలి గారు ఘోల్లుమన్నారు.

⭐ ⭐ ⭐

సరిగ్గా వారంరోజుల క్రితమే ....

" మీ కళ్ళసలవ తల్లీ ! గేదే పెయ్యదూడ పెట్టింది " అంటూ కామాక్షమ్మ గారికి జున్ను తపాళ అందించింది మునెమ్మ.

" మీ అమ్మగారి కళ్ళతో చూస్తేనే ఆవుకి కోడెదూడ. గేదెకి పెయ్యదూడ పుడతాయేమిటే ? " అప్పుడే అక్కడికి వచ్చిన పతంజలిగారు హాస్యమాడారు.

" మీరెప్పుడిలాగే అంటారయ్యా ! మీకేం తెలుసు అమ్మాగారి మహిమ .... సంతనుంచి గేది కొనుక్కొచ్చి దొడ్డో కట్టేసినాక మొదటిపాలి అమ్మగార్కే సూపించా .... అంతే , పెయ్యి నెట్టేసింది " ఆనందపడుతూ వెళిపోయింది మునెమ్మ.

" ఇంక ఆ చలవకళ్ళు ననుచూడవ్ " పతంజలిగారు కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నారు. ఒకటా– రెండా – నలభై ఏళ్ళ వైవాహిక జీవితానుబంధం. తను ఇంటికి రాగానే సూర్యోదయ మైనట్టు వెలిగే కళ్లు... ఇంకెప్పటికీ తెరుచుకోవు.

" నువ్వలా బెంబేలుపడిపోయి లాభం లేదోయ్, కాస్త గుండె దిటవు చేసుకో వాలి – తప్పదు " పేరిశాస్త్రి ధైర్యం చెబుతున్నాడు.

పతంజలి గారింటిముందు జనం తీర్థప్రజలా గుమిగూడారాఉ. అంతా కామాక్షమ్మగారి గుణగణాల్ని పొగుడుతూ వున్నారు.

" సలవ సూపు గల తల్లి "

" అమృతహస్తం మహాతల్లి "

" ఆవిడ శకునమొస్తే చాలు – రాముడ సీతమ్మోర్ని తెచ్చుకుందుకు రాచ్చసుల్తో యుద్దం సెయ్యక్కర్లేదు. ఆళ్ళే ఆ తల్లి నైచ్చి ఆ బాబు సేతిలో ఎట్టేసేవోరు. "

" అంతెందుకురా మారిగా – మొన్న పెసిండెటుగోరింటపెళ్ళయింది కదా ...."

☆ ☆ ☆

ప్రెసిడెంటు గారి రాకకు పతంజలి ఆశ్యర్యపోయాడు. ఆయన కర్చీలో కూచున్నాక " ఏమిటి సెలవ్ " అన్నాడు

" ఏం లేదు పంతులుగారు .... మా పెద్దమ్మాయి పెళ్ళి కుదిరింది,. రేపు ఆరో తారీకున లగ్గం పెట్టారు. రేపు పసుపు కొడుతున్నారు. మొదటి పోటు అమ్మగారి సేత ఏయించాలని మా యాడదాని కోరికి ....రేపు అమ్మాగార్ని ఓపాలి మా ఇంటికిరమ్మని సెబుదారని వచ్చాను "

" ప్రెసిడెంటు గారే ! నాకు తెలియకడుగుతాను. మా ఆవిడొచ్చి మొదటిపోటు వెయ్యకపోతే పెళ్ళి జరగదంటారా ! " కొంటెగా అడిగారు.

" అయ్యబాబోయ్ – అదేం మాటండీ ! ఆవిడది సలవ సెయ్యి . ఆ మా తల్లి సెయ్యి పడితే చాలు గొడ్డుటావు కూడా ఈనెయ్యాల్సిందే. మీరీ తిరకాసు లేం ఎట్టక రేపు అమ్మగార్ని పంపండి. లేక పోతే మా యాడది నన్ను తినేస్తది. " అన్నాడు ప్రెసిడెంటు.

పతంజలి గార్కి వాళ్ళ మూర్ఖత్వం చూసి నవ్వొచ్చేది. ఇలా ఒక్క ప్రెసిడెంటే కాదు. ఎవరింట్లో పెళ్ళి జరిగిని ఆవిడెళ్ళి పసుపు కొట్టాలి. ఎవరింటో అన్న ప్రాశన జరిగినా ఆవిడే మొదటిసారి పరమాన్నం తినిపించాలి, ఎవరింటో గృహ ప్రవేశం జరిగిన ముందుగా ఆవిడ దేముడి పటం పుచ్చుకుని లోపల అడుగు పెట్టాలి......

పతంజలి గారు ఈ రకం నమ్మకాల్లేని ఆధునికుడూ కాదు. నాస్తికుడూ కాదు ,. కానీ తనికివ్వని ప్రత్యేకత తన భార్యకిస్తున్నప్పుడు మాత్రం భరించలేకపోయేవాడు. దానిక్కారణం తరతరాలుగా వస్తున్న పురుష అహంకారము అతనిలో నిబిడీ కృతంగా వుండటం వల్ల కావచ్చు ....లేదా అందరూ కొనియాడే " అమృత హస్తపు ప్రభావం " అతని జీవింత మీద, అతని ఆర్ధిక పరిస్థితుల మీద ఽకనిపించి వుండకపోవచ్చు.

అంతమాత్రం చేత అతనికి ఆమె మీద ప్రేమ లేదని కాదు ! ఆమె ఎప్పుడూ ఆయన మాటకుఎదురు చెప్పలేదు . పైగా " నా కది కావాలి, ఇది కావాలి " అని ఎప్పుడూ నోరు తెరిచి అడిగిన పాపాన పోలేదు. ఉన్నదాంట్లో గుట్టుగా సంసారం గడుపుకొచ్చింది. నలభయి ఏళ్ళలో ఆ దంపతులెప్పుడూ తగూలాడుకోలేదు.

అమృత హస్తమనీ ఆమెది చలవచూపనీ ఎవరైనా వచ్చినఎప్పుడు వాళ్ళతో హాస్యమాడేవాడే తప్ప ' వెళ్ళొద్దని ' ఆమె నెప్పుడూ శాసించలేదు, అలా తీసుకువెళ్ళిన వాళ్లు అలా ఆమె నెప్పుడూ ఉట్టి చేతులతో పంపేవారుకాదు కనీసం తాంబూలం రవికలగుడ్డ ఇచ్చి పంపేవారు ఆయన అభ్యంతరం చెప్పకపోవడానికి అదే కారణం కావచ్చు.

" మీ అబ్బాయికి టెలిగ్రాం ఇప్పిస్తాను. దహన సమయానికి ఎలాగూ రాలేడు .... కనీసం "

పేరిశాస్త్రిని పూర్తి చెయ్యనియ్యలేదు పతంజలిగారు. ఏడుపులో మెలికలు చుట్టుకుపోతున్నాడు.

" వాడొచ్చి అమ్మేది నాన్నా ! అని అడిగితే నేనేం చెప్పేదిరా – ఇహ నా మంచి చెడ్డలు ఎవరు చూస్తారు, నేను తిన్నానో లేదో ఎవరిక్కావాలి ? "

ఏడుపులో కొన్ని మాటలు ముద్దగా వస్తున్నాయి.

" అలా అనుకుంటే ఎలా ? మేమంతా లేమూ. పోయిన వాళ్ళతో మనమూ పోలేం కదా ! జీవికి భూమ్మీద నూకలు నిండిపోయాయి. వెళ్ళిపోయింది. కాలం తీరిక నువ్వేమిటి, నేనేమిటి – అందరం వెళ్ళాలిసిన వాళ్ళమే ? "

పేరిశాస్త్రి సముదాయిస్తున్నాడు.

జనం బాగా పల్చబడ్డారు,ఆ మె చీకటి పడ్డాకపోయిన కారణంగా అప్పుడు దహనం చేయడానికి వీల్లేదు. తెల్లవార్లు శవాన్ని అక్కడ పెట్టుకుని కూర్చోవాలి. చుట్టుప్రక్కల వాళ్ళు ఓ ఐదారుగురు మాత్రమే పతంజలిగారికి తోడుగా ఆ అరుగుమీద కూర్చున్నారు.

" మరి రేపటి కార్యక్రమానికి పైకం ఏమైనా వుందా ? " పేరిశాస్త్రి అడిగాడు.

“ లేదు. ఉన్నదీ కాస్త నిన్నా, ఈ వేళా మందులకి, మాకులకి అయిపోయింది ” బెక్కుతూ  చెప్పారు పతంజలిగారు.

“ మరయితే  ఎలా ?? నేనో యాభయి సర్దుతాను. కానీ చాలవుకదా ? ”

పది నిమిషాలు ఇద్దరూ మౌనంగానే ఉన్నారు.

మనిషి పుట్టక, చావు కూడా డబ్బుతో ముడిపడ్డాయన్న సంగతి పతంజలి గారికి మరోసారి అర్థమయ్యింది.

నలభయ ఏళ్ళపాటు తన జీవితాన్ని పంచుకున్న  భార్య చావుకి  ఏడ్వాలో – ఆమెను ఇంత బూడిదచేయలేని  తన ఆర్ధక పరిస్దితికి ఏడ్వాలో  ఆయనకర్థం కాలేదు. “ పోనీ ప్రెసిడెంటుగార్ని నీ తరపున చేబదులడుగుతాను ”

పేరిశాస్త్రి కలాంటి ఆలోచన వచ్చినందుకు  పతంజలిగారు మనసులోనే అభినందించారు.

అరుగుమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటున్న ప్రెసిడెంటుగారు పేరిశాస్త్రిని  చూడగానే “ ఏం శాత్తిగారూ ? మహా ఇల్లాలు  మనల్ని ఇడిసిపెట్టేసి ఎల్లిపోయింది. అలాటి అమురుత అత్తంకల తల్లి, సలవ సూపుగల తల్లి దొరకమన్నా దొరకుతాదా ! ఇంకా మా మనవడి బారసాల వరకు ఉంటారనుకున్నాను, ఆయువు మూడిపోయింది, ఎల్లిపోయింది.

ప్రెసిడెంటుగారి మాటలతో పేరిశాస్త్రి  ఏకిభవించాడు,  తర్వాత తానొచ్చిన కారణం చెప్పాడు. రెండొందలు సర్ధమని పతంజలి తరపున ప్రాధేయపడ్డాడు.

“ నిన్నే మా అల్లుడొచ్చి మోటార్ సైకిల్ కొంటానన్జెప్పి ఉన్నదంతా ఊడ్చి పట్టుకెళ్ళిపోయాడు ”

పేరిశాస్త్రి ఏమీ మాటాడలేదు.

“ రెండొందలిత్తే  ఆ ముసిలిపంతులెట్టా తీరుత్తాడు. అయ్యేం రూపాయలా ? కాల్చిపారేసిన సుట్టపీకలా ? ” అనుకున్నాడు ప్రెసిడెంటుమనస్సులో తిరిగి వెళ్ళిపోతున్న పేరిశాస్త్రిని చూస్తూ.

జరిగింది విన్న పంతులుగారు అవాక్కయిపోయాడు తన భార్యను చూసి అంతా అమృతహస్తం, అమృతహస్తం ! అంటూ అరుస్తూ నవ్వుతూ ఇకిలిస్తూ గేలి చేస్తున్నట్టనిపించింది.

“ ఆవిడది సలవసెయ్యి –  సలవసెయ్యి ” అంటూ పొగిడే  ప్రెసిడెంటు ఆ చలవచెయ్యి కల మనిషా చల్లబడి  పోతే – తగలెయ్యడాన్కి రెండొందలు  అదీ  అప్పుగా ఇవ్వనంటున్నాడు.

“ ఛీ వెధవ  మనుషులు  ” కసిగా  పైకి అన్నారు పతంజలిగారు.

“ నువ్వారికే ఇదై పోకయ్యా – నేనెళ్ళి శెట్టిని  అడిగొస్తాను  ” అన్నాడు. పేరిశాస్త్రి.

సరేనన్నారు పతంజలిగారు.

పేరిశాస్త్రి తనొచ్చిన పని శెట్టిభార్యతో చెప్పాడు, కామాక్షమ్మగారి మరణానికి  ఆమె ఎంతో  దు:ఖపడి, సానుభూతికురిపించి లోపలికి వెళ్ళొచ్చి “ ఆయన వూళ్ళో లేరయ్యా – సాయంత్రమే పట్నం ఎల్లారు. పోనీ ఇనప్పెట్టి తీసుందేమోనని చూసొచ్చాను – తాళాలు వేసేసి పట్టుకుపోయారు. ” అంది  నిర్లిప్తంగా.

పేరిశాస్త్రి ఇంటిముఖం పట్టాడు.

శెట్టి ఇంటిమెట్లు దిగుతుండగా సెట్టి ఖళ్ళు ఖళ్ళు మని దగ్గడం వినిపించింది. అతని మనస్సులో సెట్టంటే అసహ్యత పేరుకుంది.

జరిగిని  విషయం పతంజలికి చెప్పాడు.

పతంజలిగారు బాధపడ్డారు.

శెట్టి తన కళ్ళముందే కిరాణాకొట్టు పెట్టి లక్షలు సంపాయించాడు. సంవత్సరం క్రితమే బట్టలకొట్టు కూడా పెట్టాడు.

ఓ రోజు తన దగ్గరకొచ్చి

“ మాష్టారూ బట్టలకొట్టు రేపే ప్రారంభిస్తున్నాను. అమ్మగారొచ్చి  దేవుడి పూజ చేసి తొలిబేరం  చెయ్యాలి ” అన్నాడు.

“ ఇప్పుడు  మా ఇంట్లో బట్టలవసరం లేవయ్యా ” అన్నాడు పతంజలిగారు కొంటెగా.

“ అయ్యబాబోయ్ – అలా అనకండి ఓ రవికల గుడ్డ కొనిపించండి చాలు ఆమెది అమృత హస్తం. ఆమె బోణీ బంగారం ” అన్నాడు.

మర్నాడామె వెళ్ళి తొలిబేరం చేసి వచ్చింది.

అలాటి సెట్టి ఆ మనిషి చచ్చిపోతే – రెండొందలు అప్పివ్వడానికి ఇంట్లో ఉండే లేడనిపిస్తున్నాడు.

ఛీ వెదవ మనుషులు.

రావిచెట్టు పవిత్రంగా దేవుడని  కొలిచే మనుషులు అది ఎండిపోతే  – కొట్టేసి పొయ్యిలో  పెట్టేసుకుంటారు. పతంజలిగారి మెదడు గిరగిరా తిరుగుతోంది.

అందరూ తన భార్యని  అవహేళన చేస్తున్నట్టనిపించింది.

బంగారపు చెయ్యి, అమృత హస్తం ఆమె ఏం చేసినా బంగారమే – బంగారం, అమృతం.... హస్తం ....చలవచెయ్యి .....బంగారం చెయ్యి.....

పతంజలి గారి ఆలోచనలు ఠక్కున ఆగిపోఆయయి తను రిటైరైపోగానే మొదటిసారి పించను తెచ్చుకోడానికి వెళ్ళి వచ్చినరోజు రాత్రి.

కామాక్షమ్మగార్ని తన పక్కనే కూర్చోపెట్టుకుని ఆమె చేతని తన చేతిలోకి తీసుకున్నారు.

ఆ చేతికి ..... మట్టిగాజులు.

" కాముడూ – నలభై ఏళ్ళుగా కాపురం చేస్తున్నా ఏనాడు నోరు తెరిచి ఏమీ అడగలేదు ఆడాళ్ళకి సహజంగా ఓ చీర కావాలనీ, ఓ నగ కావాలనీ.... ఇంత వయసొచ్చినా మెళ్ళో పుస్తెలు, చేతికి మట్టిగాజులు తప్ప ఏమి లేదు. నీకేం చెయ్యలేకపోయాను కదూ ! "

" మీరలా అనకండి – ఆడదానికి నగల, చీరలూ ఇవే కాదు ముఖ్యం, భర్త ఆప్యాయత, ఆపేక్ష అవి ముఖ్యం. నాకెలాంటి కోరికలూ లేవు. ఉన్న ఒక్క కొడుకు వాడి బతుకేదో వాడు బతుకుతున్నాడు. ఈ ఇంట్లో మీ ఒడిలో సుమంగళిగా కళ్ళు మూస్తే అదే చాలు. అంతకుమించి నాకేం కోరికలూ లేవు "

పతంజలిగారు అమెను మాట్లాడనియ్యలేదింక.

" అలా అనకు కాముడూ – నువ్వు లేవన్న ఆలోచనే భరించలేను. నువ్వులేకపోతే అసలు బతకగలనా ? "

ఆమె ముఖంలో వెయ్యి సూర్యకిరణాలు తళుక్కుమన్నాయి. ఆయన జేబులోంచి పొట్లం తీసి తను కొన్న బంగారుగాజులు రెండు ఆమె చేతులకు తొడిగారు.

" ఎందుకండి – ఇప్పుడివి కొన్నారు ? "

" ఉద్యోగంలో ఉన్ననాళ్ళు ఏం కొనలేకపోయాను. ఈ వేళ నాకు రిటైర్‌మెంట్ గ్రాట్యూటీ వచ్చింది. ఆ డబ్బెట్టి కొన్నాను. ఏదో నా ఆనందం నాది. " అన్నారు.

" మీ ఆనందం కోసం తప్పకుండా వేసుకుంటాను. ఎప్పుడేనా వీటి అవసరం పడితే మీరానందంగా వీట్ని తీసుకోండి " అంది.

ఆమె రెండు చేతుల పైకెత్తి ఆయనకు చూపించింది.

ఆయన కళ్ళల్లో కోటి విద్యుద్దీపాలు వెలిగాయి.

పతంజలి గారికి తన గుండెల్లో ఎవరో చేత్తో కెలుకుతున్నట్టనిపిందిచింది.

" తెల్లవారేసరికి శవాన్ని కదిలించాలి – లేకపోతే ఈ వీధిలో ఎవరూ రేపు వండుకోకూడదు, మరేం చేద్దామో ఆలోచించు " అన్నాడు పేరిశాస్త్రి.

పతంజలి గారు దృడ నిశ్చయానికొచ్చారు.

మెల్లగా లేచివెళ్ళి శవం మీద గుడ్డ తొలగించి ఆమె చేతికున్న గాజులు తొలగించారు. అవి తీస్తున్నప్పుడు ఆయనకి దు:ఖం పొర్లుకొచ్చింది.

" వీటిన్నేను ఆనందంగా తీసుకోడం లేదు కాముడూ – పచ్చి అవుసరం. ఇన్నాళ్ళు అందరూ నీది అమృత హస్తం అంటుంటే ఓర్వలేని తనంవల్ల నాకు ఇవ్వని ఖ్యాతి నీకిస్తున్నారని అసూయపడ్డాను నీది నిజంగానే అమృతతం హస్తమే – ఆ విలువ ఇప్పుడు తెలిసొచ్చింది " అనుకుంటూ మూగగా ఏడుస్తున్నారు.

పేరిశాస్త్రి ఆ గాజులు తీసుకుని శెట్టి దగ్గర తాకట్టు పెట్టడాన్ని బైల్దేరి చీకట్లో కల్సిపోయాడు.

పతంజలిగారి మనస్సులో సూర్యోదయమైంది.

## -------- అయ్యిపోయింది --------

**( కీ.శే.పమ్మి వీరభద్రరావుకి కృతజ్ఞతలతో )**